ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం


జిల్లా వార్తలు

ఆదివారం 2 మార్చి 2025

93 శాతం పింఛన్ల పంపిణీ

గరుగుబిల్లి, మార్చి1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం 93 శాతం మేర ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ జరిగింది. 15 మండలాలు, 3 పట్టణాల పరిధిలో 1,39,908 మంది లబ్ధిదారులకు గాను 1,30,051 మందికి పింఛన్ సొమ్ము అందించారు. ప్రభుత్వం రూ. 59 కోట్లు విడుదల చేయగా తొలిరోజు సచివాలయ సిబ్బంది పింఛన్ల రూపంలో లబ్ధిదారులకు రూ. 54 కోట్లు అందించారు. గ్రామాల్లో పింఛన్ల పంపిణీని అధికారులు పర్యవేక్షించారు. వృద్ధులు, దివ్యాంగులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం మిగిలిన వారికి పింఛన్లు అందించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కురుపాంలో పరిశీలిస్తున్న కలెక్టర్

● తొలిరోజు 586 మంది గైర్హాజరు ● భామిని మండలంలో ఒకరు డీబార్




సాలూరు: బొడ్డవలస బాలయోగి గురుకులం బయట విద్యార్థులు ఇలా..

బెలగాం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. అధికారులు ఒక్క నిమిషం నిబంధన అమలు చేశారు. సెల్‌ఫోన్ సహా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. జనరల్ విభాగంలో 6,372, ఒకేషనల్ విభాగంలో 2,963 మందికి గాను మొదటిరోజు 8,749 మంది హాజరయ్యారని, 586 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి మంజులవీణ తెలిపారు.

ఒకరు డీబార్

భామిని: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఓ విద్యార్థిని డీబార్ చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎస్‌వీఎల్ నారాయణరావు తెలిపారు. మొత్తంగా 250 మంది తెలుగు, 42 మంది ఒడియా మీడియంలో పరీక్షలు రాశారు.

నది దాటడమే పరీక్ష



నాగావళి నది దాటి ఇంటర్ పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు

కొమరాడ: నాగావళి నది దాటి కొమరాడ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకోవడం ఇంటర్ విద్యార్థులకు పెద్ద పరీక్షగా మారింది. శనివారం కొట్టు గ్రామం నుంచి ఇద్దరు విద్యార్థులు నాగావళి నది దాటి పరీక్షకు హాజరయ్యారు. నదిపై వంతెన నిర్మించకపోవడంతో ఏటా ఇబ్బందులు తప్పడం లేదని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి పూర్ణపాడు గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆరు నెలల చంటి బిడ్డతో ...

పార్వతీపురం మండలం బాలగుడబకి చెందిన బి.గాయత్రి ఆరు నెలల చంటి బిడ్డతో పరీక్షకు హాజరైంది. ఒక చేతిలో బిడ్డ.. మరో చేతిలో హాల్ టికెట్ పట్టుకుని కేంద్రానికి వచ్చింది. అనంతరం బిడ్డను బంధువులకు ఇచ్చి పరీక్ష రాయడానికి వెళ్లింది.



చంటి బిడ్డతో పరీక్షకు హాజరైన గాయత్రి

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

కురుపాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. విద్యా మండలి మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని ప్రిన్సిపాల్ లలిత, ఇన్విజిలేటర్లను ఆదేశించారు. వేసవి దృష్ట్యా పక్కాగా తాగునీటి వసతి కల్పించాలని, పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.



ఘనసర- సతివాడ మధ్య తోటల్లో ఉన్న ఏనుగులు

గజరాజుల బీభత్సం

● మూడెకరాల్లో కర్బూజ పంట నాశనం

కురుపాం,మార్చి1(ఆంధ్రజ్యోతి): కురుపాం పంచాయతీ పూతికవలసలో గజరాజులు బీభత్సం సృష్టించాయి. శుక్రవారం రాత్రి గ్రామ సమీపంలోని మూడెకరాల్లో కర్బూజ పంటను నాశనం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట చేతికందొచ్చిన సమయంలో గజరాజుల కారణంగా తీవ్రంగా నష్టపోయామని వారు వాపో యారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేశారు. కాగా ఈ విషయం తెలుసు కున్న అటవీ శాఖాధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని పంటను పరిశీలించారు. నష్టాన్ని ఉన్నతాధి కారులు తెలియజేస్తామన్నారు. ప్రస్తుతం గజరాజులు కొమరాడ మండలం వన్నాం గ్రామానికి చేరుకున్నాయి. దీంతో ఆ గ్రామస్థులు, రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

ఘనసర-సతివాడ సమీపంలో...

భామిని: కొద్దిరోజులుగా ఘనసర ప్రాంతంలో సంచరించిన ఏనుగులు శుక్రవారం రాత్రి సతివాడ గ్రామం దాటి పోలవరం రహదారి వైపు వెళ్లాయి. శనివారం మళ్లీ ఘనసర-సతివాడ మధ్య తోటల్లోకి చేరాయి. ప్రస్తుతం ఆ ప్రాంతానికి సమీపంలో ఆర్అండ్‌బీ రహదారి ఉండడంతో వాహనదారులు, స్థానికులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. మరోవైపు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.దాలినాయుడు, ట్రాకర్స్ ఏనుగులు సంచారంపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



పూతికవలసలో కర్బూజ పంటను నాశనం చేసిన గజరాజులు

ఈ నగర పంచాయతీకి ఏమైంది?



● అవినీతి ఊబిలో అధికారులు ● తరచూ ఏసీబీ దాడులు ● పాలనపై పట్టు సాధించని ప్రజాప్రతినిధులు ● పాలకొండలో కానరాని అభివృద్ధి

పాలకొండ, మార్చి1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పాలకొండ నగర పంచాయతీ అవినీతిలో మాత్రం ముందంజలో ఉంది. 'పేరు పెద్ద...ఊరు దిబ్బ' అన్న చందంగా డివిజన్ కేంద్రం పాలకొండ పరిస్థితి మారింది. ఎటుచూసినా చెత్త కుప్పలు, పూడికలతో నిండిన కాలువలు, రోడ్డుపై మురుగునీరు, చెత్తాచెదారాలు దర్శనమిస్తుండగా.. ఏ కాలంలో అయినా పారిశుధ్య సమస్య వేధిస్తోంది. ఇప్పటివరకు పాలకులుగా ఉన్నవారంతా అభివృద్ధిపై పట్టు సాధించకపోవడంతో నగర పంచాయతీ పరిస్థితి దారుణంగా మారింది. పాలకులు ఏకతాటిపై నడిచి అభివృద్ధిపై కార్యాచరణ రూపుదిద్దడంలో విఫలమవుతున్నారు. గ్రూప్‌లుగా విడిపోయి వ్యక్తిగత దూషణలు, ఆరోపణలతోనే కాలం గడిపేస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని అధికారులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ ప్రజలను దోచుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగులు నుంచి కమిషనర్ వరకు అన్ని విభాగాల్లోనూ అవినీతి కోరలు చాస్తోంది. ఎంతో కొంత ముట్టచెబితే గాని పనులు జరగని పరిస్థితి ఏర్పడింది. అవినీతి అధికారుల భరతం పట్టేందుకు నగర పంచాయతీలోని ప్రజలు కూడా వెనకాడడం లేదు. అందుకే గడిచిన 12 ఏళ్లలో నలుగురు కమిషనర్లు ఏసీబీకి చిక్కారంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మొత్తంగా మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్ గ్రేడ్ అయినా ప్రజలకు పన్నుల భారం తప్ప అభివృద్ధి ఫలాలు అందడం లేదు.

పన్నెండేళ్లలో నలుగురు కమిషనర్లు...

నగరపంచాయతీలోని 20 వార్డుల్లో సుమారు 40 వేల మంది జనాభా ఉన్నారు. కాగా మేజర్ పంచాయతీగా ఉన్న పాలకొండ 2013, మార్చి 20న నగరపంచాయతీగా అప్ గ్రేడ్ అయింది. ఈ పన్నెండేళ్లలో 16 మంది కమిషనర్లు పని చేయగా.. వారిలో నలుగురు ఏసీబీకి చిక్కారు. 2013, మార్చి 20న నగర పంచాయతీగా అప్ గ్రేడ్ అయిన తర్వాత అదే ఏడాది రెండో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.నాగభూషణ రావు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. 2015లో టి.కనకరాజు ఒక ధ్రువపత్రం జారీ చేసేందుకు ఏసీబీకి చిక్కి కటకటాల పాలయ్యారు. 2020లో నగర పంచాయతీ మేనేజర్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్‌కు గురయ్యారు. 2021లో కమిషనర్ నడిపేన రామారావు ఓ ధ్రువప త్రం జారీ చేసేందుకు అధిక మొత్తంలో డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ కోవలోనే తాజాగా నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు డాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో కూడా ఉమామహేశ్వరరావు అనే కార్య నిర్వాహణాధికారి ఏసీబీ వలకు చిక్కి సస్పెండ్ అయ్యారు. అదేవిధంగా మరో ఇద్దరు ఈవోలు అవినీతి ఆరోపణలతో సస్పెండ్‌కు గురయ్యారు.



పాలకొండ పట్టణం వ్యూ

సిరిమానుకు రూపం

● సాలూరులో చెట్టుకు పూజలు చేసిన కమిటీ సభ్యులు

● రూట్‌మ్యాప్‌ను పరిశీలించిన విద్యుత్ శాఖ అధికారులు



6లో

గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై రైతుల నిరసన



8లో

మనుమకొండను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

భామిని, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ ఎంపిక చేసిన మనుమకొండ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. శనివారం ఆ గ్రామంలో ఆయన పర్యటించారు. ముందుగా వన్‌ధన్ వికాస కేంద్రంలో పసుపు ప్రోసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. సీతంపేట గిరిజన ప్రాంతంలోని పసుపునకు మంచి గిరాకీ ఉందని, అయితే సీజనల్‌గా లభించే వాటిపై కూడా దృష్టిసారించాలని సూచించారు. అదే గ్రామంలో సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్న మొండింగి తొర్లమికి పింఛను అందించారు. బీటెక్ చదివి కోచింగ్ తీసుకుంటున్నానని ఆమె చెప్పడంతో అభినందించారు. ఆమెకు వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డికి సూచించారు. తొర్లమి ఇంటిలో మరుగుదొడ్డి ఏర్పాటు చేయించాలని అధికారులను ఆదేశించారు. సికిల్‌సెల్ అనీమియా బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా యంత్రాంగం, ఐటీడీఏ తోడుగా ఉంటుందని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలను ఆదేశించారు. సికిల్‌సెల్ అనీమియా బాధితుల వివరాలు సేకరించాలని వెలుగు సిబ్బందికి సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతల వివరాలను సేకరించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామస్థులకు సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టుల ద్వారా సంపద సృష్టించాలన్నారు. గ్రామంలో సేంద్రియ వ్యవసాయం చేపట్టాలన్నారు. పాలవలసకు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరగా ప్రతిపాదనలో ఉందన్నారు. పంటల నిల్వకు గోదాము నిర్మించాలని కోరగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఈ రమాదేవిని ఆదేశించారు. మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని పీవోకు సూచించారు. ఆ తర్వాత గిరిజనులతో కలిసి వారు థింసా నృత్యం చేశారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

గురండిలో వరిసాగును చూసి కలెక్టర్ ఆగి రైతులతో మాట్లాడారు. వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, రాగులు, పామాయిల్‌ను సాగు చేయాలని సూచించారు. కాగా తాము వరికి అంకితమయ్యామని, పురుగులు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు బిల్లులు ఇవ్వడం లేదని రైతులు తెలిపారు. వ్యవసాయంలో పార్వతీపురాన్ని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అజోలా యూనిట్లను ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఆ తర్వాత ఆయన బిల్లుమడ జీడి ప్రోసెసింగ్ యూనిట్, భామినిలో ఏకలవ్య పాఠశాలను సందర్శించారు.



మనుమకొండ ఆదివాసీలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

వీడీవీకే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం

సీతంపేట రూరల్: వీడీవీకేల్లో మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం జగతిపల్లి వ్యూ పాయింట్‌ను సందర్శించారు. అనంతరం పాత పనుకువలస నర్సరీని సందర్శించారు. టూరిజం అభివృద్ధి, గ్రామదర్శిని కార్యక్రమంపై అధికారులకు సూచనలు చేశారు. జీడి, కొండచీపుర్లు, అగర్‌బత్తి, పసుపు ప్రోసెసింగ్ యూనిట్లు, సెరీకల్చర్ యూనిట్, మొగదార గ్రామంలో మల్బరీ సాగును పరిశీలించారు.

రోగులకు నాణ్యమైన వైద్యం

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ

కురుపాం/కొమరాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. శనివారం కురుపాం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం, కొమరాడ మండలం మాదలంగి పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. లేబర్ రూము , మందులు, వ్యాక్సిన్ నిల్వలు, హార్ట్‌స్ట్రోక్ సమయంలో ఇచ్చే స్టెమీ ఇంజక్షన్లు, బ్లడ్ బ్యాంక్, ఐసీటీసీ, నవజాత శిశు కేంద్రం, రక్త పరీక్షల విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం రోగులతో మాట్లాడారు. కురుపాం ఆసుపత్రిలో భవన నిర్మాణాలను పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. నిరంతరం వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్, వైద్యులు ఉన్నారు.



కురుపాం ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ

కన్నా.. నాన్న దగ్గర బజ్జో..!



హమ్మయ్య... పరీక్ష కేంద్రానికి వచ్చేశాం

ఓ తల్లి భర్తతో పాటు తన ఏడు నెలల చిన్నారిని ఎత్తుకుని విజయనగరంలోని ఓ పరీక్ష కేంద్రానికి చేరుకుంది. అప్పటి వరకు బిడ్డను లాలించిన తల్లి... పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి 'కన్నా..బజ్జో' అంటూ భర్త దగ్గర చిన్నారిని విడిచిపెట్టి కేంద్రంలోకి వెళ్లే ప్రయత్నం చేసింది. తనను బయట వదిలి వెళుతున్న అమ్మను చూసి ఆ పిల్లాడు బుంగ మూతి పెట్టుకొని... ఏడుపు అందుకున్నాడు. చిన్నారిని ఓదార్చేందుకు తండ్రి ఆపసోపాలు పడ్డారు. చివరకు వారితో తెచ్చుకున్న పాలడబ్బాలోని పాలు బాబుకు తాగించాడు. దీంతో ఆ బిడ్డ శాంతించాడు. పరీక్ష పూర్తయ్యాక బయటకు వచ్చిన తల్లిని చూసి ఆ చిన్నారి మోము ఆనందంతో విప్పారడం చూసి... అక్కడి వారు ఆశ్చర్య చకితులయ్యారు.

- (విజయనగరం, ఆంధ్రజ్యోతి)



బై బై అమ్మా... పరీక్ష బాగా రాయాలి



అమ్మ ఓపోయ్.. నేను మాట్లాడను



పాలు తాగుతూ ఉండు.. అమ్మ వచ్చేస్తుంది



ఝాన్సీకి టిఫిన్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



చక్రాల కుర్చీలో పరీక్ష కేంద్రంలోకి..

చదువుల తల్లికి కఠిన పరీక్ష

విజయనగరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అందమైన రూపం.. చదువులో చురుకుదనం. ఆ అమ్మాయిని చూస్తే ఎవరికైనా ముచ్చటేస్తుంది. అదే సమయంలో దేవుడు ఆ బాలికకు పెట్టిన కఠిన పరీక్షను చూసి కళ్లు చెమర్చుతాయి. ఇదీ ఝాన్సీ అనే విద్యార్థిని పరిస్థితి. జామికి చెందిన లగుడు సత్తిబాబు, చిన్నమ్మలకు పొలం పనులే ఆధారం. వీరికి ఇద్దరు సంతానం. పెద్దవాడు గోవర్ధన్. రెండో సంతానం ఝాన్సీ. చిన్నప్పటి నుంచే ఆ పాపకు అంగవైకల్యం. తనకు తానుగా నడవలేదు. తన పనులు కూడా చేసుకోలేదు. వీటికి తోడు ఫిట్స్ వేధిస్తున్నాయి. ఆ చిట్టితల్లికి కన్నతల్లే దగ్గర ఉండి చూసుకోవాల్సిన పరిస్థితి. ఇన్ని ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నా లెక్క చేయని ఝాన్సీ..చదువులో చురుగ్గా ఉంటోంది. అన్ని తరగతుల్లోనూ మంచి మార్కులతో ఉత్తీర్ణురాలవుతూ వస్తోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీలోని ఓ కళాశాలలో ఇంటర్ పరీక్ష రాసేందుకు తల్లిదండ్రులు ఆ బిడ్డను ఆటోలో తీసుకువచ్చారు. కొంత దూరం చక్రాల కుర్చీలో.. ఆ తరువాత అమాంతం ఎత్తుకుని పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లారు. ఈ దృశ్యాని చూసిన వారి కళ్లు చెమ్మగిల్లాయి. పరీక్ష బాగా రాశానని ఝాన్సీ చెప్పడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు.



పరీక్ష పూర్తయ్యాక ఆటో వద్దకు..

ఉరుకులు.. పరుగులు

- ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం



ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. వివిధ పరీక్ష కేంద్రాల్లో ఉదయాన్నే విద్యార్థులు బారులు తీరారు. నిమిషం నిబంధన కారణంగా విద్యార్థులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వచ్చింది. దివ్యాంగ విద్యార్థులు కాస్త ఇబ్బంది పడ్డారు. కొంతమంది విద్యార్థినులు చంటి బిడ్డలతో పరీక్షలకు హాజరయ్యారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు సరైన రవాణా సౌకర్యాలు లేక అవస్థలు పడ్డారు. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో పరిమితికి మించి...ప్రమాదకర స్థితిలో ప్రయాణం చేయవలసి వచ్చింది. ఒక్కో ఆటోలో 15 మంది వరకు ప్రయాణించడం గమనార్హం.

- (ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం: రూమ్ నెంబర్లు వెతుకుతూ..

విజయనగరంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు



విజయనగరం: ఆటోలపై ప్రమాదకరంగా..

వీరఘట్టం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

బొబ్బిలి: పరీక్ష కేంద్రం వద్ద ..

భోగాపురం: మోడల్ స్కూల్‌లో..

బొండపల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

'అమ్మకు వందనం' అంటూ..!

లక్కవరపుకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట వద్ద గల మహాత్మా జ్యోతిభాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం 'అమ్మకు వందనం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లులకు కాళ్లు కడిగి పూజలు చేశారు. పురోహితుల సమక్షంలో వేదమంత్రాల నడుమ సరస్వతీ పూజ నిర్వహించి.. అనంతరం తల్లులకు పిల్లలు పాదపూజ చేశారు. ఆ నీటిని బిడ్డలు తలలపై చల్లుకున్న సందర్భంలో మాతృమూర్తులు ఉద్వేగానికి గురయ్యారు. ముఖ్యఅతిథిగా తుని గురుకుల పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డి.సత్యరవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చనలు



పూజల్లో పాల్గొన్న దంపతులు

కొత్తవలస, మార్చి 1(ఆంధ్రజ్యోతి) దేవాడ, ముసిరాం గ్రామాల మధ్యలో రామలింగపురం తోటలో నిర్మించిన దుర్గమ్మ ఆలయంలో శనివారం 108 మంది దంపతులతో కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, క్షీరాధివాసం, నదీజలాలతో అభిషేక కార్యక్రమాలను వేద పండితుడు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు.

డిప్యూటీ మేయర్ మార్పు?

- పెద్ద మనుషుల ఒప్పందం మేరకేనా?
- రేసులో ఆశావహులు

విజయనగరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విజయనగరం నగర పాలక సంస్థలో డిప్యూటీ మేయర్ మార్పు తప్పదా? అనే ప్రశ్నకు అవుననే సమాధానమిస్తున్నాయి వైసీపీ వర్గాలు. మేయర్‌గా కాపు సామాజిక వర్గానికి చెందిన వీవీ లక్ష్మి కొనసాగుతున్నారు. రెండు డిప్యూటీ మేయర్ పదవులు ఉన్నాయి. ఒక డిప్యూటీ మేయర్‌గా మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి కుమార్తె కోలగట్ల శ్రావణి ఉండగా... మరో డిప్యూటీ మేయర్‌గా అప్పట్లో ముచ్చి నాగలక్ష్మి యాదవ్‌ను ప్రకటించారు. ఆమె మృతి చెందడంతో.. అదే సామాజిక వర్గం నుంచి నగరంలోని 13వ డివిజన్‌లో విజయం సాధించిన ఇసరపు రేవతీదేవికి డిప్యూటీ మేయర్‌గా అవకాశమిచ్చారు. ఆ సమయంలో 'ఏడాదిన్నర మాత్రమే బాధ్యతలు' అనేలా ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి సమక్షంలో ఒప్పందం కుదిరింది. పదవీ కాలం మరో మూడు నెలలు ఉండగానే.. 2024 సాధారణ ఎన్నికలు సమీపించడంతో రేవతీదేవిని ఆ బాధ్యతల నుంచి తప్పించి... తిరిగి నగరంలోని ఒకటో డివిజన్ నుంచి గెలుపొందిన దివంగత నాగలక్ష్మి యాదవ్ కుమార్తె లయ యాదవ్‌కు అవకాశం కల్పించారు. ఆ సమయంలోనే దాసన్నపేట ప్రాంతానికి చెందిన పొంతపల్లి మాధవితో పాటు, నగర పాలక సంస్థలో ప్రస్తుతం సీనియర్‌గా ఉన్న ఎస్‌వీవీ రాజేష్, ఎస్సీ సామాజిక వర్గం నుంచి విజయం సాధించిన రేగాన రూపావతి తదితరులు ఈ పదవిని ఆశించారు. కానీ ముచ్చి లయ యాదవ్‌కే కోలగట్ల అవకాశం కల్పించారు. అప్పట్లోనే 'ఏడాదిన్నర కాలం'పై ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఈ నెల రెండో వారానికి ఆమె పదవీ కాలం పూర్తి కానుంది. వైసీపీ రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా... నగర పాలక సంస్థలో సంపూర్ణమైన మెజార్టీ ఉన్న నేపథ్యంలో డిప్యూటీ మేయర్ మార్పు విషయమై గత రెండు రోజులుగా వైసీపీ నాయకులు, కార్యకర్తల్లో వాడీవేడి చర్చ జరుగుతోంది. మరోవైపు ఆశావహులు పొంతపల్లి మాధవి, ఎస్‌వీవీ రాజేష్, రేగాన రూపావతి దేవితో పాటు మరికొందరు డిప్యూటీ మేయర్ పదవి కోసం పావులు కదుపుతున్నట్టు సమాచారం.



విజయనగరం నగర పాలక సంస్థ కార్యాలయం

మారనున్న రాజకీయం

విజయనగరం నగర పాలక సంస్థ రాజకీయం మారనుంది. మరో పది నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కూటమి నేతలు కూడా నగర పాలక సంస్థ రాజకీయాలపై ఆసక్తిగా ఉన్నారు. వైసీపీ ప్రస్తుత పరిణామాలను నిశితంగా పరిశీలిస్తోంది. డిప్యూటీ మేయర్ విషయంలో వైసీపీలో విభేదాలు రావడం సహజమని... పది నెలల కాలమే ఉండడంతో దీనిపై కోలగట్ల వీరభద్రస్వామి పెద్దగా దృష్టి పెట్టడం లేదని తెలుస్తోంది. మున్ముందు ఈ రాజకీయాలు ఎలా మారుతాయో వేచి చూడాలి.

సిరిమానుకు రూపం

- చెట్టుకు పూజలు చేసిన కమిటీ సభ్యులు
- రూట్‌మ్యాప్‌ను పరిశీలించిన విద్యుత్ శాఖ అధికారులు

సాలూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ అమ్మవారి పండుగలో ప్రధాన ఘట్టమైన సిరిమానును తయారు చేసేందుకు శనివారం శ్రీకారం చుట్టారు. ఆలయ అనువంశిక ధర్మకర్త విక్రమచంద్ర సన్యాసిరాజు, పూజారి ధనంజయరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు అక్కాన అప్పారావు, అల్లువారి కుటుంబ సభ్యులు, అల్లు బెనర్జీ, శ్యాం, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, నిమ్మాది తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆర్సీఎం పాఠశాల నుంచి తెచ్చిన చెట్టుకు పూజలు చేశారు. అనంతరం చెట్టును సిరిమానుగా మలిచారు. ఉత్సవ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఈ సంవత్సరం అమ్మవారి సిరిమాను 48 అడుగులు ఉండబోతోందని తెలిపారు.



ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

రూట్ మ్యాప్ పరిశీలన

మే నెలలో నిర్వహించనున్న శ్యామలాంబ అమ్మవారి పండుగ సందర్భంగా సిరిమాను తిరువీధికి ఆటంకం లేకుండా... ప్రజలకు విద్యుత్ సమస్య లేకుండా అధికా రులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. రూట్ మ్యాప్‌ను అధికారులు పరిశీలిస్తున్నారు. సిరిమాను తిరిగే ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలను మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా విద్యుత్ శాఖ డీఈ కె.గోపాలరావు, ఏఈడీ వి.రంగారావు, ఏఈ బి.నాగేశ్వరరావుతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. వీరితో పాటు విద్యుత్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న దృశ్యం

డ్వాక్రా మహిళలకు మరింత ఆర్థికాభివృద్ధి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాధాన్య రంగాలకు పెద్దపీట వేయడంతో పాటు రాష్ట్రం ప్రగతిపథంలో పయనించేందుకు వీలుగా రాష్ట్ర బడ్జెట్ ఉందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు మరింత ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. శనివారం పార్టీ కార్యాలయంలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన శాఖకు సంబంధించి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలోని జాతీయ గ్రామీణ జీవనోపాదుల పథకం (ఎన్ఆర్ఎల్ఎం)కు గత ఏడాది బడ్జెట్‌లో రూ.350 కోట్లు కేటాయింపులు జరగగా, ఈ బడ్జెట్‌లో రూ.790 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. మహిళలకు రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు అందజేసి వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు మంజూరు చేయక పోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 8 నెలలకే రాజకీయాలకు అతీతంగా పంచాయతీలకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 వేల కోట్లు 15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరు చేశామన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

గ్రామాల్లో సోషల్ సర్వీస్ చేసే కార్యకర్తలను నియమించుకుని పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. గ్రామాల్లో 120 మంది ఓటర్లుకు ఒక మహిళ, ఒక పురుషుడిని లీడర్ షిప్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ పరిధిలో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, పి.వి.వి. గోపాలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు చప్పా చంద్రశేఖర్, కోరాడ కృష్ణ, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

జిల్లాలో 95.84 శాతం పింఛన్ల పంపిణీ

విజయనగరం కలెక్టరేట్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 95.84 శాతం జరిగింది. కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి పర్యవేక్షణలో పింఛన్ల పంపిణీ జరిగింది. జిల్లాలో మొత్తం 2,73,083 పింఛన్లకు గానూ శనివారం 2,61,413 మందికి పంపిణీ చేశారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

విజయనగరం రింగురోడ్డు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తీరును శనివారం ఉదయం నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య వివిధ ప్రాంతాల్లో పరిశీలించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పింఛన్ల పంపిణీలో కార్యదర్శుల పనితీరును ఫోటో క్యాప్చరింగ్ వంటి ప్రక్రియలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఎవరైనా పెన్షన్ తీసుకోకపోతే మరుసటి రోజు అందిస్తామన్నారు.

ఉచితంగా నమాజ్ పుస్తకాలు

విజయనగరం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉచితంగా నమాజ్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు పట్టణశాఖ ముస్లిం ప్రతినిధి మహ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. 38 వేల నమాజ్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు మార్చి 1 నుంచి ఏప్రిల్ 5 వరకూ పంపిణీ చేయనున్నామన్నారు.

రాయపురాజుపేటలో 45 మందికి వైద్య పరీక్షలు

కొత్తవలస, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేటలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అప్పన్నపాలెంలోని జిందాల్ స్టెయిన్‌లెస్ కర్మాగారం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 45 మందికి వైద్యాధికారి తెన్నేటి సుబ్బారావు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్మాగారం యాజమాన్య ప్రతినిధులు హాజరయ్యారు.

మహిళా కళాకారుల ప్రదర్శనకు 12 ఎంట్రీలు

రాజాం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా ఈనెల 9న సలాది వెంకటరమణ కళాపరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న ఉత్తరాంధ్ర స్థాయి మహిళా కళాకారుల ప్రదర్శన పోటీలకు 12 ఎంట్రీలు వచ్చినట్లు పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలాది తులసీదాస్, అర్నిపల్లి వెంకటనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు అదే రోజు రాత్రి 8.30 గంటల నుండి ప్రారంభమవుతాయన్నారు. ప్రతి ప్రదర్శనకు 15 నిమిషాల వ్యవధి ఉంటుందన్నారు. అనంతరం విజేతల వివరాలు వెల్లడిస్తామన్నారు. గెలుపొందిన విజేతలకు 10న నగదు ప్రోత్సాహకాలను ప్రదానం చేస్తామన్నారు.

కీర్తన.. జిల్లాస్థాయి విజేత

లక్కవరపుకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో శనివారం నిర్వహించిన సైన్స్ డేలో పోటీల్లో జమ్మాదేవిపేట ఎంజేపీ పాఠశాల విద్యార్థిని కసిరెడ్డి కీర్తన ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. జాతీయ సైన్స్ డేలో భాగంగా గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్ విభాగంలో బహుమతి సాధించింది. కీర్తనను ప్రిన్సిపాల్ పాత్రో అభినందించారు.

పాఠశాలకు 32 ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూసపాటిరేగ, మార్చి1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 2005 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు శనివారం 32 సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. ఇందుకుగానూ వారు రూ.80 వేల మేర వెచ్చించారు. ఫ్యాన్లను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు పిన్నింటి సందీప్, వి.సుభాష్, పి.తాతునాయుడు తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బలివాడ శంకరరావు పూర్వ విద్యార్థులను అభినందించారు.

చేతల ప్రభుత్వమిది: కళా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ముఖ్యమంత్రి చంద్రబాబు తన బడ్జెట్ ద్వారా మరోసారి నిరూపించారని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధ్యాతనిచ్చి బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. శనివారం సాయంత్రం ఆయన చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం రూ.37వేల కోట్లతో వ్యవసాయం కోసం ప్రత్యేకంగా బడ్జెట్ పెట్టిన ఘనత చంద్రబాబుదేనన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో రహదారులకు కూడా మహర్దశ పట్టనుందన్నారు. రహదారుల మరమ్మతులకు ఇప్పటికే రూ.9 వేల కోట్లు కేటాయించారన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ అమలు ప్రారంభమయ్యిందన్నారు. దేశంలో ఇప్పటికే అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో ఆంధ్రప్రదేశ్ పోటీ పడుతోందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, పైల బలరాం, గవిడి నాగరాజు, సారేపాక సురేష్, ఇజరోతు రాంబాబు, ఆరతి సాహూ, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు తదితరులున్నారు.

బడ్జెట్‌తో అన్నివర్గాలకు మేలు



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

విజయనగరం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్, వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్.. రాష్ట్ర ప్రజలకు మేలు చేసేలా ఉందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలయ్యేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించారన్నారు. తల్లికి వందనం, రైతులకు ఆర్థికసాయంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి ఉపయోగపడేలా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేశారన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధులు అధికంగా కేటాయించారన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కనకల మురళీమోహన్, బొద్దల నర్సింగరావు, అల్తి బంగారుబాబు, కర్రోతు నర్సింగరావు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, కోండ్రు శ్రీనివాసరావు, నడిపిల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


కూటమిది మోసాల బడ్జెట్



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం దాసన్నపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో శుక్రవారం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరితమైనదని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1.6 కోట్ల మందికి ఆడబిడ్డ నిధి కింద ఏటా రూ.18 వేల ఆర్థిక సాయాన్ని మరోసారి ఎగ్గొట్టడంతో మహిళలు ఏడాదికి సుమారు 28,800 కోట్లు కోల్పోతున్నారన్నారు. తల్లికి వందనం అంటూనే బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లకు పైగా కోత పెట్టారని ఆరోపించారు. సమ్మిళత ఆలోచనలతో ఉండాల్సిన బడ్జెట్.. మోసాలు, గాడి తప్పిన అంకెల సమాహారంగా మిగిలిందని విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు సూర్యనారాయణరాజు, నెక్కల నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి చిన్నజీయర్ స్వామి రాక



స్వామిజీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

చీపురుపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి శనివారం రాత్రి చీపురుపల్లి విచ్చేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఇంట్లో ఆదివారం జరగాల్సిన శుభ కార్యక్రమం నిమిత్తం ఆయన వచ్చారు. శనివారం రాత్రి చీపురుపల్లి చేరుకున్న స్వామిజీని స్థానిక ప్రముఖులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనతో పాటు తెలంగాణ రాష్ట్రం మెదక్ ఎంపీ ఎం.రఘునందనరావు ఉన్నారు.

ఎంవీజీఆర్‌లో సందడిగా వార్షికోత్సవం

డెంకాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎంవీజీఆర్ కళాశాలలో శనివారం వార్షికోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విశాఖ నుంచి ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ నుంచి ఎస్.సురేష్, గ్రూప్ మేనేజర్ కె.కిశోర్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంవీజీఆర్ ప్రిన్సిపాల్ డా.రమేష్ మాట్లాడుతూ పరిశ్రమకు సిద్ధంగా ఉన్న గ్రాడ్యుయేట్‌లను తయారు చేయడమేనని కళాశాల లక్ష్యమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ కంపెనీలతో నెట్‌వర్కింగ్ చేయడం ద్వారా ఇంజినీరింగ్ సంస్థలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడానికి ఎంవీజీఆర్ కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా అకడమిక్ ఎక్స్‌లెన్స్ సాధించిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను అందజేశారు. అనంతరం కల్చరల్ షో నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.వై.ఎం.సి.శేఖర్, డీన్‌లు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి కృషి చేద్దాం

● ఎస్పీ వకుల్ జిందాల్



ఓపెన్ హౌస్‌లో విద్యార్థినిలతో ఎస్పీ

విజయనగరం క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధి, సాధికారిత, సమానత్వం కోసం కృషి చేద్దామని ఎస్పీ వకుల్ జిందాల్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సాధికారిత వారోత్సవాలను ప్రారంభించారు. విద్యార్థినిలు, మహిళల భద్రత, పోలీసు విధులపై నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మార్చి 7 వరకూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈనెల 8న జిల్లా కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఇతర శాఖల సహకారంతో ర్యాలీ నిర్వహించి పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఈ సందర్భంగా పోలీసులు వినియోగిస్తున్న తుపాకులు, బాంబు డిస్పోజల్ పరికరాలు, డ్రోన్స్, క్లూస్‌టీం ఆధారాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు లీలారావు, నర్సింహమూర్తి, శ్రీనివాసరావు, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేశ్‌కుమార్, శ్రీనివాసరావు ఉన్నారు.

హోంగార్డుకు సత్కారం

విజయనగరం క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు బొత్స సుందరరావును ఎస్పీ వకుల్ జిందాల్ సత్కరించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధులు నిర్వహించడంలో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి ఇతర పోలీసు ఉద్యోగులకు సుందరరావు ఆదర్శంగా నిలిచేవారన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని 37 ఏళ్ల విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హోంగార్డు ఇన్‌చార్జి ఆర్ఐ రమేశ్ కుమార్, హెచ్‌సీలు రాజు, శ్రీనివాసరావ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో భూ క్రయవిక్రయాలు జరగాలి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్

గజపతినగరం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో భూముల రిజిస్ట్రేషన్లు చేసుకునే వీలు కల్పిస్తున్నప్పటికీ డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయించాల్సిన అవసరం ఎందుకు వస్తోందని జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రామలక్ష్మి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్యాక్యుమెంట్ రైటర్ల వల్ల భూక్రయవిక్రయదారులు ఇబ్బందులు పడుతున్న కారణంగా ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. ఈ విషయాన్ని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శాఖాపరంగా వార్షిక ఆదాయాన్ని రూ.30 కోట్లు చేరుకోవాల్సి ఉండగా ఇప్పటికి రూ.24 కోట్లుకు చేరుకుందన్నారు. మార్చి నెలాఖరు నాటికి రూ.6 కోట్లు లక్ష్యం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యాలయంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమెతో పాటు సబ్ రిజిస్ట్రార్ తవిటయ్య ఉన్నారు.


వాడీవేడిగా మండల సమావేశం




ఎంపీపీని నిలదీస్తున్న సభ్యురాలు

లక్కవరపుకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): లక్కవరపుకోట మండల సర్వసభ్య సమావేశం శనివారం వాడివేడిగా జరిగింది. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ కలెక్టర్ ప్రత్యేక అనుమతితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నడూలేని రీతిలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజులపై గత ప్రభుత్వం చేసిన తప్పిదాలపై టీడీపీ సభ్యులు ఎదురుదాడికి దిగారు. అప్పట్లో లేని తీర్మానాలు ఇప్పుడెందుకని ఎంపీపీని సభ్యులు నిలదీశారు. అప్పుడు పంచాయతీల తీర్మానాలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. తామరాపల్లి, లచ్చింపేట సర్పంచ్‌లు భాస్కరరావు, యర్రయ్యమ్మలతో పాటుగా తలారి సర్పంచ్ జ్యోతి ప్రతినిధి గుమ్మడి ప్రసాద్ ఎంపీపీతో వాగ్వాదానికి దిగారు. వీవోఏలు, మేట్లు నియామకం, పీఆర్, ఉపాధిహామీ పథకంలో మంజూరైన పనులకు సంబంధించి పంచాయతీ, మండల పరిషత్ తీర్మానాలు లేకుండా అధికార పార్టీకి చెందినవారు పనులు చేపడుతున్నారని వైసీపీ సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. దీనిపై టీడీపీ సభ్యులు స్పందిస్తూ గతంలో ఎలా జరిగాయో ఇప్పుడూ అలాగే జరుగుతాయని బదులిచ్చారు. దీనిపై ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కల్పించుకుని ఒకరికొకరు సహకరించుకుని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.అప్పారావు, మండల అధికారులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ





తిమిడి, కుమారాం విద్యార్థినిలు

శృంగవరపుకోట రూరల్/జామి మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో నిర్వహించిన జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో ఎస్.కోట మండలం తిమిడి విద్యార్థినిలు వబ్బిన తులసి, పిల్లా సిరిసంజన ప్రతిభ చాటి బహుమతులు గెలుచుకున్నారని గైడ్ టీచర్ సుందరాడ అప్పారావు తెలిపారు. జామి మండలం కుమారాం కస్తుర్బా విద్యార్థిని కె.హేమలత క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎస్‌వో జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మిక ఒప్పందాలు అమలు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

నెల్లిమర్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ అధికారులు చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన జరజాపుపేటలో జూట్ మిల్లు కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 10న విశాఖ లేబర్ అధికారుల వద్ద జరిగిన ఒప్పందాలను జూట్ యాజమాన్యం అమలు చేయాలన్నారు. అలాగే 2016లో రిటైరైన కార్మికులకు మూడు గ్రాడ్యూటీ బకాయి ఇవ్వడానికి మూడు చెక్కులు జూట్ యాజమాన్యం ఇచ్చిందని వాటిలో ఒకటి మాత్రమే చెల్లుబాటు అయ్యాయని, మిగతా చెక్కులు బౌన్స్ అయినట్లు తెలిపారు. కార్మికులకు దఫాదఫాలుగా కాకుండా ఒకేసారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కె.పద్మనాభం, ఎస్.రమణ, ఎం.రాము, ఎం.కృష్ణ, టి.తాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

క్రైంన్యూస్

నెల్లిమర్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో పూతికపేట గ్రామానికి చెందిన పత్తిగిడి నాగరాజు (25) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగరాజు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎన్ఐటీ కళాశాలలో చదువుతున్నాడు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి తండ్రి రామకృష్ణ, తల్లి రాజేశ్వరి ఉన్నారు. వీరికి రెండో సంతానం నాగరాజు. పెద్ద కుమారుడు చిరంజీవి హైదరాబాద్‌లో ఎంటెక్ చేస్తున్నాడు. తన చిన్న కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని శనివారం మధ్యాహ్నం స్వగ్రామం పూతికపేటకు తీసుకువచ్చారు. నాగరాజు మృతి చెందడంతో ఆయన స్వగ్రామం పూతికపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. నాగరాజు మృతిని గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు.

మనస్తాపానికి గురై యువకుడు..

గరివిడి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో కోనూరు గ్రామానికి చెందిన సంచాన రమణ (35) శుక్రవారం రాత్రి తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య అమల గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తోంది. ఈ దంపతులకు 13 ఏళ్ల కుమార్తె, ఏడాది వయసుగల కుమారుడు ఉన్నారు. మృతుడు రమణ తన కూతుర్తె శ్యామలను చదువు కోవాలని మందలించాడు. ఈ విషయంపై భార్య అమల, రమణల మధ్య వాగ్వాదం జరిగింది. మనస్తాపానికి గురైన రమణ ఇంటిలోకి వెళ్లి ఉరివేసుకున్నాడు. గరివిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

పొరపాటున పురుగుమందు తాగి మృతి

గరివిడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు పంచాయతీ వైఎస్ఆర్ కాలనీకి చెందిన పిన్నింటి పాపారావు (50) శుక్రవారం రాత్రి పొరపాటున పురుగుల మందు తాగి మృతి చెందాడు. పాపారావు తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. పండ్లకు ఉపయోగించే మందును తాగునీరు అనుకుని పొరపాటున తాగేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108 వాహనంలో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. గరివిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూల్ బస్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

శృంగవరపుకోట రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైతుబజారు వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన చెందిన సరిత నాగభూషణం (55) దుర్మరణం చెందాడు. అతడిని ప్రైవేట్ స్కూల్ బస్ ఢీ కొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశాడు. స్థానికుల కథనం మేరకు.. ఎస్.కోటకు చెందిన నాగభూషణం కొత్తవలసలో కూలీ పనులు చేస్తుంటాడు. శనివారం ఉదయం పనికి వెళ్తున్న సమయంలో కొత్తవలసలో ఉంటున్న తన కుమార్తె కోసం కూరగాయలు కొనేందుకు రైతుబజారుకు వెళ్లాడు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు నడిచి వస్తుండగా ఓ స్కూల్ బస్సు అతడిని బలంగా ఢీ కొట్టింది. ఎస్.కోట ఆసుపత్రికి తరలించినప్పటికే నాగభూషణం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి..

వీరఘట్టం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ పైనుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వీరఘట్టంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఎస్ఐ కళానిధి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన ఉదయాన శివగణేష్(27) ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ట్రాక్టర్ మరమ్మతుల కోసం సామగ్రి కొనుగోలు చేసేందుకు వీరఘట్టం వచ్చాడు. పని పూర్తయిన తర్వాత అదే రోడ్డులో వేరొక ట్రాక్టర్ ఎక్కి వీరఘట్టం వస్తున్నాడు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా వచ్చేసరికి ట్రాక్టర్‌పై నుంచి కింద పడ్డాడు. తలపై నుంచి ట్రాక్టర్ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శివగణేష్‌కు భార్య రమ్య, పాప తేజశ్రీ, బాబు మహాన్స్ ఉన్నారు. ట్రాక్టర్ వేగంగా అజాగ్రత్తగా నడిపిన కారణంగానే పడిపోయి చనిపోయాడని మృతుడి తండ్రి ఉదయాన రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ..

గరివిడి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో గొట్నంది గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురైన బొడ్డు బండమ్మ (70) రాజాంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. గురువారం రాత్రి ఆమె చుట్ట కాల్చి పడుకున్న మంచంపై పెట్టి నిద్ర పోవడంతో అగ్ని ప్రమాదం సంభవించి బండమ్మ గాయాలపాలైన విషయం విదితమే. 80 శాతం వరకు బండమ్మ శరీరం కాలిపోయి మృత్యువుతో పోరాడుతూ తుదిశ్వాస విడిచింది. గరివిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

పద్ధతి మార్చుకోండి: సీఐ

రాజాం రూరల్, మార్చి 1, (ఆంధ్రజ్యోతి): పద్ధతి మార్చుకోండి.. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రౌడీ షీటర్లను రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. రాజాం టౌన్ సర్కిల్ పరిధిలో రౌడీ షీటర్లకు శనివారం రాత్రి స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. కొంతమంది గంజాయి సేవించి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారని, దాడులకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రెండ్రోజుల క్రితం రాజాంకు చెందిన ఓ రౌడీ షీటర్, గురవాం గ్రామానికి చెందిన గంజాయి ముఠా మధ్య జరిగిన దాడులను ప్రస్తావించారు. నిబంధనలు అతిక్రమించవద్దని హితవు పలికారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాజాం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాజాం-బొబ్బిలి రోడ్‌లో ఫైర్ స్టేషన్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డారు. శనివారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి రాజాం ఎస్ఐ రవికిరణ్ అందించిన వివరాల మేరకు.. వస్త్రపురి కాలనీకి చెందిన ఆగూరు తిరుపతిరావు శనివారం సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఢీకొనండంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. తీవ్రంగా గాయపడిన తిరుపతిరావు విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. క్షతగాత్రుడి అన్నయ్య వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

పోలీసుస్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

నెల్లిమర్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థులు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. శనివారం పోలీసు స్టేషన్‌ను వారు సందర్శించి పోలీసుల విధులు, రికార్డుల నిర్వహణ తదితర వాటిని ఎస్ఐ బి.గణేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐ విద్యార్థులతో మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

LAND FOR SALE
★ 6 acres mango and teak farm with borewell at Tekkalivalasa Village, 150 meters from NH-6. 11 kms from Rajam for Sale. Cont.: 98453 56733, 8978326333
AJV_231163

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

సమస్యల పరిష్కారానికి 'చలో విజయవాడ'



డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పార్వతీపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6 చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆశ వర్కర్ల యూనియన్ ప్రతినిధులు శివానీ, సీఐటీయూ నాయకులు జీవీ రమణ, వాకాడు ఇందిర తదితరులు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్ పట్నాన కామేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. పనిభారం తగ్గించాలని, వేతనాలు పెంచాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయులు బి.సూరిబాబు, ఎం.గౌరి, టిపద్మావతి, జి.భాగ్యలక్ష్మి, ఎం.పద్మావతి, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకాల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రిని పూర్తి చేయండి

సాలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని డీసీహెచ్‌ఎస్ డా.రాజ్యాలక్ష్మి అన్నారు. పట్టణంలో ఉన్న ఏరియా ఆసుపత్రిని ఆమె శనివారం సందర్శించారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు. ఆసుపత్రిలో రోగులకు తక్షణం వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మీనాక్షి పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం

బెలగాం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం నాయకుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు రాష్ట్ర బడ్జెట్‌ను నిరసిస్తూ శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. జిల్లాకు రాష్ట్ర బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఎరువుల దుకాణం తనిఖీ

సీతానగరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్జలో విజయ రామ ఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణాన్ని సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.మధు శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణంలో రైతులకు ఖచ్చితంగా రశీదులు ఇవ్వాలని, రశీదు పుస్తకాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఎరువుల ధరలు, లభ్యత బోర్డును ప్రదర్శించాలన్నారు. అనంతరం ఎరువుల గొడౌన్‌ను తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి అవినాష్ మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూగజీవాలకు టీకాలు

పాలకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోనంవారి వీధిలో శనివారం మూగజీవాలకు సామూహిక గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పశు సంవర్థక అధికారి డా.శివ్వాల మన్మథరావు ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటువ్యాధి నివారణకు జిల్లాలో ఉన్న ఆవులు, గేదెలు, ఎద్దులకు టీకాలు వేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 98 పశువులకు టీకాలు వేశారు. పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డా.ప్రభామాణిక్యరావు, మండల పశువైద్య అధికారి బి.సిద్ధార్థ, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్ణపాడు-లాబేసు వంతెనను పూర్తి చేయండి

పార్వతీపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో పూర్ణపాడు, లాబేసు వంతెనను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం నాయకుడు సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖ ఇంజనీర్లకు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వంతెన పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన ఇంజినీరింగ్ అధికారులకు వివరించారు.

ముగ్గురిపై బైండోవర్ కేసు

రామభద్రపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జోగిందొరవలస గ్రామా నికి చెందిన ముగ్గురు సారా అమ్మకందారులపై స్థానిక తహసీల్దార్ ఆకుల సులోచనా రాణి వద్ద బైండోవర్ కేసులు నమోదు చేశామని బొబ్బిలి ఎక్సైజ్ సీఐ చిన్నంనాయుడు తెలిపారు. లక్ష రూపాయలకు సంవత్సరం పాటు బైండోవర్ చేశామని చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సారా అమ్మకాలు చేపట్టినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

షెడ్లను వినియోగంలోకి తీసుకురండి

రాజాం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయితీ అధికారి వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం సోపేరు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను ఆయన పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. రోజూ డోర్ టు డోర్ సేకరిస్తున్న తడి, పొడి చెత్తను షెడ్ వద్దకు తరలించాలని సూచించారు. ఆయనతో పాటు డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ పట్నాయక్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి, సర్పంచ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సమయపాలన పాటిస్తే కూలి గిట్టుబాటు

రాజాం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీలు సమయ పాలన పాటిస్తేనే కూలి గిట్టుబాటు అవుతుందని ఏపీవో సాయిరాం అన్నారు. శనివారం గడ్డిముడిదాంలో చేపడుతున్న తోటపల్లి ప్రధాన కాలువ పనులను ఆయన పరిశీలించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా సమయానికి వచ్చి నిబంధనలు ప్రకారం పనులు చేపడితే రోజు కు రూ.300 తక్కువ లేకుండా కూలి గిట్టుబాటు అవుతుందన్నారు.

పుణ్యగిరి ఆదాయం రూ.15 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పుణ్యగిరిలోని ఉమా కోటి లింగేశ్వరస్వామి ఆలయానికి శివరాత్రి పర్వదినం సందర్భంగా 15లక్షల 8వేల 69 రూపాయలు ఆదాయం లభించిందని ఈవో నాగేంద్ర తెలిపారు. శనివారం పుణ్యగిరి కొండపై హుండీ, టికె ట్లు, ప్రసాదాల ఆదాయం కొట్టాం కోటమ్మతల్లి ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో లెక్కించారు.

కులవృత్తిలోకి కార్పొరేట్ల ప్రవేశం తగదు

కొత్తవలస, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల కులవృత్తిలోకి కార్పొరేట్ స్థాయి సంస్థలు చొరబాటు తగదని ఆ సామాజికవర్గం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం కొత్తవలసలో నిర్వహించిన సమావేశంలో తెలకరాపు అప్పారావు, వడ్డాది శంకరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కులవృత్తుల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని తెలిపారు. తమ వృత్తిలోకి కార్పొరేట్లు ప్రవేశించకుండా ప్రభుత్వాలే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తవలస వారపు సంత కారణంగా ఇంతవరకు ఉండే గురువారం నాటి సెలవును రద్దు చేసి మళ్లీ మంగళవారమే క్షురకుల షాపులకు సెలవుగా మార్చుకునేందుకు తీర్మానం చేశారు.

పాఠశాలను తరలించొద్దు

● గుడివాడ కాలనీవాసుల ఆందోళన



గుడివాడ కాలనీ పాఠశాల ముందు నిరసన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బలిజిపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పలగర పంచాయతీ గుడివాడ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను తరలించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా స్కూల్ కమిటీ చైర్మన్ శ్యాంబాబు మాట్లాడారు. మడ్డువలస రిజర్వాయర్ ముంపు గ్రామం నుంచి వచ్చిన 500 నిర్వాసిత కుటుంబాలకు సంబంధించి పిల్లల చదువు కోసం ప్రత్యేకంగా ఇక్కడ పాఠశాల ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పట్నుంచి పిల్లలు ఇదే పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ వస్తున్నారని చెప్పారు. నేడు మోడల్ స్కూల్ పేరుతో ఈ పాఠశాల విద్యార్థులను పలగర గ్రామానికి తరలించేందుకు చర్యలు తీసుకోవడం తగదన్నారు. చిన్న పిల్లలు అంత దూరం వెళ్లడానికి ఇబ్బందులు పడతారన్నారు. ఆ దారిలో రెండు చెరువులను, శ్మశాన వాటికను దాటి వెళ్లాల్సి ఉంటుందని తెలిపా రు. వర్షాకాలంలో చాలా ఇబ్బం దులు ఎదురవుతాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుడివాడ పాఠశాలను తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

3, 4, 5 తరగతులే వెళ్తాయి

గుడివాడ కాలనీలో ఉన్న పాఠశాల యథావిధిగా అక్కడే ఉంటుంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పలగర పంచాయతీ కేంద్రంలో మోడల్ ప్రైమరీ పాఠశాలకు ప్రతిపాదన పంపించాం. దీంతో 3, 4, 5 తరగతుల విద్యార్థులు మాత్రమే మోడల్ స్కూల్‌కి వెళ్తారు. గుడివాడ పాఠశాలలో 25 మంది విద్యార్థులు ఉండగా ఒకటి, రెండు తరగతులు 13 మంది, 3నుంచి 5 తరగతుల వరకు 12 మంది ఉన్నారు. 3, 4, 5 తరగతుల పిల్లలను పలగర మోడల్ స్కూల్‌లో చేర్పిస్తాం. మిగిలిన 13 మంది ఇదే పాఠశాలలో విద్యను అభ్యసిస్తారు.

- సింహాచలం, ఎంఈవో, బలిజిపేట

రేపు రాజా కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూ

బొబ్బిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజా ఆర్ఎస్ఆర్‌కే రంగారావు కళాశాలలో సోమవారం దివీస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వీరేంద్ర కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2000 నుంచి 2005 సంవత్సరం లోపు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్, ఎనలాటికల్ కెమిస్ట్రీ, బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్, బి.పార్మసీ చదివిన పురుష అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు అర్హులని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారిని క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎనాలసిస్, ప్రొడక్షన్ యూనిట్‌లో ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు సోమవారం ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికేట్స్, జిరాక్స్ కాపీలు, బయోడేటా, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ఎన్.శరత్‌కుమార్ (81860 92999)ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్

బొబ్బిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి రెండూ ఒకే తాటిపై నడిపించేలా బడ్జెట్‌ను అమోఘంగా రూపొందించారన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు, సాగునీటి వనరులకు ఇతర ప్రధాన రంగాలకు నిధుల కేటాయింపు సముచితంగా ఉందన్నారు. తెలుగు భాషాభివృద్ధి కోసం తొలిసారిగా బడ్జెట్‌లో రూ.10కోట్లు కేటాయించడం ఎంతో సంతృప్తిని కలిగిస్తోందన్నారు.

చురుగ్గా రక్షిత తాగునీటి పథకం పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రామభద్రపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నర్సాపురం గ్రామంలో రక్షిత తాగునీటి పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల ఆంధ్రజ్యోతిలో మూలనపడిన రక్షిత తాగునీటి పథకం... అందని తాగునీరు అనే శీర్షికన వెలువడిన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికా రులు స్పందించారు. ఈ మేరకు రక్షిత పథకం పనులు చేపట్టారు. ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి, తాగునీరు అందిం చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై సర్పంచ్ కోట వెంకటనాయుడు మాట్లాడుతూ తమ గ్రామానికి తాగునీటి సమస్య పరిష్కారం కావడం ఆనందదాయకం అన్నారు.

గ్రామాల్లో క్రాష్ ప్రోగ్రాం

బొబ్బిలి రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా శనివారం గ్రామాల్లో గల చేతిపంపులు, బోర్లకు మరమ్మతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణకుమార్ మాట్లాడుతూ మండలంలో క్రాష్ ప్రోగ్రాం చురుగ్గా సాగుతోందన్నారు. ఇప్పటివరకు 10 గ్రామాల్లో సుమారు 30 పాడైన చేతి పంపులను బాగు చేశారని, తుప్పుపట్టిన పైపులను మార్చి కొత్తవాటిని అమర్చారని తెలిపారు. ● సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో త్రివిక్రమరావు శనివారం క్రాష్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇదివరకు మరమ్మతులకు గురైన బోరుబావులను బాగు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై రైతుల నిరసన



గ్రీన్ ఫీల్డ్ హైవేపై బైఠాయించిన రైతులు

పాచిపెంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు వెళ్లేందుకు, వచ్చేందుకు వీలు లేకుండా చేశారని పలువురు రైతులు శనివారం ఉదయం గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై బైఠాయించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు గంట పాటు గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణానికి సంబంధించిన వాహనాలను అడ్డుకున్నారు. దీంతో వారి నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. స్థానిక తహసీల్దార్ డి.రవి వెంటనే నిరసన కార్యక్రమం వద్దకు చేరుకున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో రైతులు నిరసనను విరమించారు. ఈసందర్భంగా తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ రహదారి యాజమాన్యంతో మాట్లాడానని, ప్రతి 200 మీటర్లకు రైతులు, ప్రజల రాకపోకల దృష్ట్యా బ్రిడ్జిలు నిర్మించామని, హైవే పై నుంచి దాటే అవకాశం లేదని చెప్పారని తెలిపారు.

పోలీసు స్టేషన్లలో ఓపెన్ హౌస్



బొబ్బిలి పోలీసుస్టేషన్ వద్ద ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్న సీఐ సతీష్‌కుమార్



కురుపాం: విద్యార్థినులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

బొబ్బిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బొబ్బిలి పోలీసు స్టేషన్‌లో శనివారం సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. విద్యార్థులకు పోలీసుల విధులు, స్టేష న్‌లో ఉండే ఆయుధాల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ● తెర్లాం: స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌ఐ సాగర్‌బాబు సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ● రామభద్రపురం: స్థానిక పోలీసు స్టేషన్‌లో జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ● కురుపాం: కురుపాం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పి.నారాయణరావు ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు విధులు, బాధ్యతలు, ఆయుధాల ఉపయోగంపై వివరించారు. అనంతరం సీహెచ్‌సీ వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించారు. ● మక్కువ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. శంబర పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఏఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు, హెచ్‌సీ శ్రీనివాసరావు, పీసీలు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు పోలీసు విధులు, బాధ్య తలపై అవగాహన కల్పించారు. గరుగుబిల్లి వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఘనంగా సైన్స్ సంబరాలు

● జిల్లా స్థాయిలో విద్యార్థులకు పోటీల నిర్వహణ

● విజేతలకు బహుమతుల ప్రదానం



జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

విజయనగరం కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) జిల్లాస్థాయి జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్ శనివారం విద్యార్థులకు సెమినార్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ విక్సిత్ భారత్ అంశం పై క్విజ్, సెమినర్ పోటీలు జరిగాయి. 27 మండలాల నుంచి 63 మంది విద్యార్థులు క్విజ్ పోటీలకు, సెమినార్ పోటీలకు 25 మంది పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఈవో మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు బహుమతులు ప్రదానం చేశారు.

మండల స్థాయిలో పోటీలు

సీతానగరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి సైన్స్ సంబరాలు ఎంఈవోలు సూరిదేముడు, మువ్వల వెంకటరమణ ఆధ్వర్యంలో మరిపివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వి.తవిటినాయుడు అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, సెమినార్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. క్విజ్‌లో బూర్జ జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు, సెమినార్ పోటీలో జోగింపేట కేజీబీవీకి చెందిన 8వ తరగతి విద్యార్థి కె.జాహ్నవి, తొమ్మిదో తరగతికి చెందిన సీహెచ్ హర్షితవల్లి విజేతలగా నిలిచారు. చిత్రలేఖన పోటీల్లో మరిపివలస ప్రాథమిక పాఠశాల నుంచి పి.అంజలి, సీతానగరం ఎంపీపీ పాఠశాల నుంచి ఎం.సాత్విక్‌శర్మ, మరిపివలస జెడ్పీహెచ్ పాఠశాల నుంచి జి.శ్రావణిలు అర్హత పొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలు మార్చి 3న జరగబోయే జిల్లా స్థాయి పోటీలకు ఉల్లిభద్ర జడ్పీహెచ్ పాఠశాలకు హాజరుకావాలని ఎంఈవో సూరిదేముడు సూచించారు. ● వీరఘట్టం: స్థానిక జడ్పీ బాలికల పాఠశాలలో మండల స్థాయి సైన్స్‌డే ఉత్సవాలు నిర్వహించారు. ఇస్రో విజయాలపై పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు, క్విజ్ పోటీలు, సెమినార్లు నిర్వహించారు. విజేతలకు ఎంఈవోలు గౌరునాయుడు, ఆనందరావు బహుమతులు అందించారు.


గృహ నిర్మాణాలన్నీ జరుగుతున్నాయి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పార్వతీపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలో మంజూరు చేసిన గృహ నిర్మాణాలన్నీ జరుగుతున్నాయని సీతంపేట గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ సీహెచ్ వెంకటేష్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో గత నెల 23న 'మంజూరైనవి 5,447.. పూర్తయినవి 6' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీఎం జన్మన్ పథకంలో మంజూరైన 2,023 ఇళ్లకు గాను 282 మందిని అనర్హులుగా గుర్తించామని చెప్పారు. మిగిలిన 1,741 ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ల కోసం సీతంపేట తహసీల్దార్‌లకు తెలియజేయగా 1,386 మందికి ఎల్‌పీసీలు ఇచ్చారన్నారు. మిగిలిన 110 ఎల్‌పీసీలను కూడా ఇవ్వాలని కోరామని చెప్పారు. ఈ పథకంలో గృహాలు మంజూరై నిర్మాణాలు ప్రారంభించని వారికి సచివాలయ సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు పనులు పూర్తి చేసిన వాటికి బిల్లులు జనరేట్ చేసి లబ్ధిదారుని ఖాతాకు జమ చేశామన్నారు. ఈ పథకంలో మంజూరై ఆర్‌వోఎఫ్ఆర్ కింద 134 మంది లబ్ధిదారులకు ఎల్‌పీసీని అందించడానికి సంబంధిత అధికారులను కోరినట్టు చెప్పారు. సోమగండి పంచాయతీలో ఉన్న 111 మంది లబ్ధిదారులు కొత్తూరు మండలం అడ్డంగి పంచా యతీ సరిహద్దులో ఉన్నందున ఎల్‌పీసీ కోసం కొత్తూరు తహసీల్దార్, సీతంపేట ఐటీడీఏ పీవోలను కోరామని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

షాపు తొలగిస్తే పురుగుమందు తాగి చస్తాం

● 18వ వార్డులో తల్లీకొడుకు నిరసన



షాపు ముందు పురుగుమందు డబ్బా పట్టుకుని నిరసన చేస్తున్న తల్లీకొడుకు

సాలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తమ షాపును తొలగిస్తే ఇక్కడే పురుగు మందు తాగి చస్తామని పట్టణంలోని 18వ వార్డు వెల్లంకి వీధికి చెందిన నాగిరెడ్డి సతీష్, సుగుణమ్మ ఆందోళన చేశారు. వెల్లంకి వీధిలో అనుమతులు లేకుండా నిర్మించుకున్న వారి షాపును కూల్చేందుకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సత్యనారాయణ శనివారం అక్కడికి వెళ్లారు. ప్రొక్లయినర్‌తో పాటు అధికారులను, పోలీసులను వెంట తీసుకుని వెళ్లారు. విషయం తెలుసుకున్న షాపు నిర్మాణదారులు నాగిరెడ్డి సతీష్, సుగుణమ్మలు పురుగు మందు సీసాతో అక్కడకు చేరుకున్నారు. తమ షాపును తొలగిస్తే పురుగు మందు తాగి ఇక్కడే చనిపోతామని నిరసన తెలిపారు. 'సుమారు 30 ఏళ్లగా నా భర్త నాగిరెడ్డి నర్సింగరావు ఇదే షాపులో టైలరింగ్ చేశారు. ఇటీవల ఆయన మరణించారు.. ప్రస్తుతం నా కుమారుడు నాగిరెడ్డి సతీష్ పేరుతో షాపునకు పన్ను చెల్లిస్తున్నామని' సుగుణమ్మ తెలిపారు. తమ షాపును కూల్చే ముందు మున్సిపాలిటీలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన అన్ని షాపులను తొలగించాలని లేకుంటే ఇక్కడే పురుగు మందు తాగి చనిపో తామని ఆందోళన చేశారు. అయినా మున్సిపల్ కమిషనర్.. పోలీసుల సహాయంతో షాపును కూల్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు కలుగజేసుకుని షాపును కూల్చితే సహించేది లేదన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఇక్కడ నుంచి షాపును కూల్చవద్దని సుమారు వంద మందితో తనకు వినతిపత్రం ఇప్పించాలని సూచించారు. దీంతో బాధితులు అలా చేస్తామని చెప్పటంతో కమిషనర్ తన సిబ్బంది, యంత్రాలతో వెనుతిరిగారు.

న్యూస్ బాక్స్

ఘనంగా కొత్తపోలమ్మ ఆలయ ప్రారంభోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండదేవుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కొత్త పోలమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

వీరఘట్టం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం కోటదుర్గమ్మ ఆలయం పక్కన ధర్మవరపు పార్వతి నివసించే పూరిల్లు శనివారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని కాలిపోయింది. వెంటనే పాలకొండ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇల్లు కాలిపోవడంతో ఆమె బోరున విలపిస్తోంది.

గ్రామాల్లో డ్రోన్‌తో నిఘా



డ్రోన్‌తో నిఘా ఏర్పాటుచేస్తున్న పోలీసులు

బలిజిపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాల అదుపునకు డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టామని బలిజిపేట ఎస్‌ఐ వై.సింహాచలం తెలిపారు. పేకాట స్థావరాలు, సారా తయారీ కేంద్రాల నియంత్రణకు డ్రోన్ సాయాన్ని తీసుకున్నామని చెప్పారు. మండలంలోని నారాయణపురం, వెంగాపురం, రావివలస, బలిజిపేట సువర్ణముఖి నది తీర ప్రాంతాల్లో శనివారం డ్రోన్‌తో పరిశీలించారు.

నేటి నుంచి నూతన చలానా విధానం అమలు

మక్కువ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయ నూతన జీవో ప్రకారం ఆదివారం నుంచి మండలంలో నూతన చలానా విధానం అమలు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎం.వెంకటరమణ మూర్తి తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇస్తే గతంలో జరిమానా వెయ్యి రూపాయలు ఉండేదని, ప్రస్తుతం రూ.5 వేలు పెరిగిందన్నారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించకపోతే వెయ్యి రూపాయలు జరిమానా ఉంటుందన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే రూ.10వేలు జరిమానా ఉంటుందన్నారు. మండల ప్రజలు నూతన జీవోను గమనించి విధిగా వాహన పత్రాలు, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు.

సంపద కేంద్రాలపై నిర్లక్ష్యం వద్దు

గరుగుబిల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై నిర్లక్ష్యం వహించరాదని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు సూచించారు. మండలంలోని చిలకాం, దత్తివలస, కారివలస, నాగూరు పంచాయతీల పరిధిలోని చెత్త సంపద కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాసాల నుంచి సేకరించిన వ్యర్థాలను వేరు చేసి కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ పరిశీలనలో ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ, సర్పంచ్ త్రినాథరావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

